క్లుప్తంగా

ఆరోగ్య తనిఖీలు



మహిళ బీపీని పరిశీలిస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: స్థానిక సాయిరత్న ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 90 మందికి తిరుమల మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 40 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



పుష్పాలతో అలంకరించిన అమరవీరుల స్థూపం

డెంకాడ: మండల పరిధిలోని చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్‌లో సోమవారం నిర్వహించే పోలీస్ అమరవీరుల దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. బెటాలియన్ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు గుర్తుగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ బెటాలియన్ అధికారులు, పోలీసులు పాల్గొంటారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణ కమిటీకి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, దాత సన్యాసిరావు

లక్కవరపుకోట: మండలంలోని కుర్మవరంలో గ్రామదేవత నూకాలమ్మ వారి ఆలయ నిర్మాణానికి మల్లివీడు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త బోని సన్యాసిరావు(సన్ని) రూ.25 వేల విరాళం ప్రకటించారు. నగదును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాసంలో ఆమె చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. దాతను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోళ్ల రామ్‌ప్రసాద్, శ్రీనాథు పెదబాబు, కుర్మవరం వైస్ సర్పంచ్ దాలినాయుడు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ మహేష్

బొండపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ యు.మహేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి-26పై పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకుల లైసెన్స్, వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని చెప్పారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనకమహాలక్ష్మికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

అంత్యక్రియలకు అష్టకష్టాలు!

- కనీస వసతులకు నోచుకోని పూసపాటిరేగ శ్మశానవాటికలు
- అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- ముళ్లపొదలతో నిండిన శ్మశానవాటికల స్థలాలు
- రోడ్డు సదుపాయం లేక వర్షాకాలంలో ఇబ్బందులు



దట్టమైన ముళ్లపొదలతో పెద్దచెరువు గట్టు శ్మశానవాటిక

పూసపాటిరేగ: ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియలు నిర్వహించేందుకు మండల కేంద్రంలోని ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా పెద్దచెరువు గట్టు, కొవ్వాడ రోడ్డులోని శ్మశానవాటికలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. శ్మశానవాటికల స్థలాలు పూర్తిగా ముళ్లపొదలతో నిండిపోవడంతో పాటు వాటిల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో దహన సంస్కారాలు చేయడం కష్టతరమైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు వీలుగా సరైన రోడ్డు సదుపాయం కూడా లేదని.. ఉన్న చిన్న మట్టిరోడ్డు మీదుగానే మృతదేహం మోసుకువెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అయితే ఈ మట్టిరోడ్డులో ఏర్పడే బురదలో కాలుజారి పడిపోయి గాయాలపాలవుతున్నామని వాపోతున్నారు.

వర్షాకాలంలో పెనుసవాల్..

బూడి వీధి, యాతపేట, శాలిపేట వాసులకు చెందిన పెద్దచెరువు గట్టు శ్మశానవాటిక, కొవ్వాడ రోడ్డులోని కెల్ల, రజక, మహంతి వీధులకు చెందిన శ్మశానవాటికలోనూ అదే పరిస్థితి. షెడ్డు, దహన సంస్కారాలు నిర్వహించే పరికరం రెండూ లేకపోవడంతో వర్షాకాలంలో అంత్యక్రియలు పెనుసవాల్ అయిందని అంటున్నారు. వర్షం తగ్గినంత వరకు శ్మశానవాటికకు మృతదేహం తరలించలేకపోతున్నామన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలో చాలాచోట్ల శ్మశానవాటికలు నిర్మించి, కనీస సదుపాయాలు కల్పించారు కానీ ఒక్క పూసపాటిరేగ మండల కేంద్రంలోని శ్మశానవాటికల అభివృద్ధినే మరిచారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశానవాటికలు బాగుచేసి, కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అడవిని తలపించేలా ఉంది..

పెద్దచెరువు గట్టు దగ్గరున్న శ్మశానవాటిక అడవిని తలపించేలా ఉంది. వర్షం పడిందంటే చాలు దహన సంస్కారాల కోసం గంటల సమయం వేచి చూడాల్సిన పరిస్థితి. వర్షం తగ్గితే గానీ శ్మశానవాటికలకు మృతదేహం తరలించలేని దుస్థితి. ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించాలి.

–నరేష్, పూసపాటిరేగ వాసి

గ్రామాల సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల రూరల్: గ్రామాల సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూతికపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆమె ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రూ.17 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం చేయనున్నామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణరాజు, ఏపీవో అరుణ, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, సర్పంచ్ లెంక మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సారిక గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుత ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకుడు బొద్దల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని వికాస తరంగిణి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నీతిపద్యాల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులతో నీతిపద్యాలు కంఠస్థం చేయించడం ద్వారా మంచి నడవడిక, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అలాగే మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మెమెంటోలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, గెడ్డాపు శ్రీలక్ష్మి, ఎస్.శ్రీలక్ష్మి, కె.శంకరరావు, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు రిజిస్ట్రేషన్లు

రేగిడి: దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి గ్రామాల్లో పాలకొండకు చెందిన గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఆదివారం వచ్చి, గ్యాస్ వినియోగదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. గ్యాస్ లబ్ధిదారుల ఫోన్ నంబర్లను గ్యాస్ ఐడీ నంబర్‌లకు లింక్ చేశారు.

భూగర్భజలాల కలుషితం వల్లే డయేరియా విజృంభణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గుర్ల మండల కేంద్రంలో భూగర్భజలాలు కలుషితమవ్వడం వల్లే డయేరియా విజృంభించిందని, దీనికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. మృతి ఎనిమిది మందిలో ఒకరికి మాత్రమే డయేరియా సోకినట్లు వైద్యాధికారులు చెబుతున్నారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి ఓ బృందం గుర్ల గ్రామానికి వెళ్లిందని, అక్కడి మరణాలకు గల కారణాలు తెలియరావచ్చన్నారు. వైద్యసేవలు సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూపర్ క్లోరినేషన్ ప్రక్రియ కూడా జోరుగా సాగుతోందన్నారు. ప్రజలు డయేరియా బారినపడకుండా తమ ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 30 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న సిబ్బంది

సంతకవిటి: స్థానిక శ్రీసత్యసాయిబాబా మందిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 60 మంది నేత్రాలను వైద్యులు తనిఖీ చేసి, వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరందరికీ విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. ఈ మేరకు వారిని సాయంత్రం ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో యాలాల శ్రీనివాసరావు, పాట్నూరు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

దశావతారాల విగ్రహాల ఏర్పాటు



ఆలయ ప్రహరీపై ఏర్పాటు చేసిన విగ్రహాలు

రాజాం: పట్టణంలో చీపురుపల్లి రోడ్డులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయం వద్ద విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. కొన్నాళ్లుగా ఆలయ ప్రహరీపై తొమ్మిది విష్ణుమూర్తి అవతారాల విగ్రహాల ఏర్పాటు చేస్తుండగా, ఆదివారం వాటికి ఆలయ అర్చకులు పీసపాటి సూర్యనారాయణస్వామి, రవిస్వామి, శ్రీనివాసరావుస్వామిలు శాస్త్రోక్త పూజలు చేసి, ప్రాణప్రతిష్ఠ చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వాటిని ప్రతిష్ఠించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్తా శ్రీనివాసరావు, సీమకుర్తి ప్రసాద్ తెలిపారు.

రూ.లక్ష ఆర్థికసాయం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్యఖర్చుల కోసం చీపురుపల్లి నియోజకవర్గ తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం చేసింది. ఆశయ సంస్థ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతో మందిని ఆదుకున్న రమణ తీవ్ర గాయాలపాలవ్వడంతో ఆ సంఘంలో సభ్యులు చర్చించుకుని సహకారం అందించాలనుకున్నారు. సంఘంలో 87 మంది స్పందించి రూ.లక్ష నగదును ఫోన్‌పే ద్వారా ఆ సంఘం ప్రతినిధికి పంపించగా, ఆ మొత్తాన్ని రమణ కుటుంబానికి అందజేశారు.

పరామర్శ

గంట్యాడ: మండలంలోని కొత్తవెలగాడ మాజీ సర్పంచ్ చొడువాడ రామసూర్యం తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం కొత్తవెలగాడ వెళ్లి రాములమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములమ్మ చిత్రపటం వద్ద జెట్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, నాయకులు వేమలి ముత్యాలనాయుడు తదితరులతో కలిసి నివాళులర్పించారు.

యోగా శిక్షణ ప్రారంభం

రాజాం సిటీ: స్థానిక గాయత్రి కాలనీ ఎదురుగా ఉన్న సాయినగర్‌లో ఉచిత యోగా శిక్షణ ఆదివారం ప్రారంభమైందని యోగా గురువు టీటీవీ రమణమూర్తి తెలిపారు. యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా ఎన్నో అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

బొండపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.గిరిబాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డుల అప్‌డేట్‌తో పాటు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

బొబ్బిలి: ఎస్సీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు అందరూ తరలిరావాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆదివారం పిలుపునిచ్చారు. రఘురామకృష్ణంరాజు ఎమ్మెల్యేగా ఉంటూ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించడం, పంతం నానాజీ దళిత ప్రిన్సిపాల్‌ను అవమానించడం, మద్యం షాపుల కేటాయింపులో ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, తదితర అంశాలకు నిరసనగా ధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. దళితులంతా ఏకమై ధర్నాకు తరలిరావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురి ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల బృందం

శృంగవరపుకోట: పురుషులు, మహిళలు సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు భవానీనగర్ వద్ద ఉన్న డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 8,9,10 తేదీల్లో నంధ్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణరావు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులకు వరలక్ష్మి పీఈటీ కళాశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.వరలక్ష్మి, సిద్ధూలు క్రీడాకారులకు రవాణా ఖర్చుల కోసం రూ.5000 అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సిద్ధూ క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తామని చెప్పారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలపై డయేరియా పంజా

- గుర్ల మండలంలో అదుపులోకి రాని డయేరియా
- శనివారం నాటికి 450కు పైగా కేసులు నమోదు
- ఇప్పటి వరకు 11 మంది మృతి
- ఆదివారం వ్యాధి బారిన పడిన మరో 15 మంది
- వ్యాధి తగ్గాలని గ్రామదేవతలకు పూజలు



నాగళ్లవలస సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న యువకుడు

గుర్ల: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో డయేరియా పంజా విసురుతోంది. రోగులు, మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ప్రజలను కలవరపెడుతోంది. వ్యాధి బారినపడుతున్న వారిలో ఎక్కువగా వృద్ధులే ఉండడం, వారి ఆరోగ్య పరిస్థితి విషమిస్తుండడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. శనివారం నాటికి మొత్తం 450కు పైగా కేసులు నమోదు కాగా, 11మంది మృతిచెందారు. ఆదివారం మరో 15 కేసులు బయటపడ్డాయి. 350 మంది వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్యశిబిరాల్లో చికిత్స పొందగా, వందమంది వరకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. వీరిలో 64 మంది ఇంకా చికిత్స పొందుతున్నారు. తాగునీటి కలుషితం వల్లే వ్యాధి ప్రబలుతోందని అధికారులు చెబుతున్నారు. మండలంలోని ఉన్న కొండపాలెం రక్షిత మంచినీటి పథకం ద్వారా మండలంలోని 26 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ గ్రామాల్లోనే ఎక్కువగా డయేరియా బాధితులు ఉన్నారు. మండల కేంద్రం గుర్లలో అయిదుగురు, నాగళ్లవలసలో ఎనిమిది మంది, కెల్ల గ్రామంలో ఇద్దరు ఆదివారం డయేరియా బారినపడ్డారు. వీరిలో నలుగురు గుర్ల పీహెచ్‌సీలో, ముగ్గురు నెల్లిమర్ల సీహెచ్‌సీలో, ఇద్దరు చీపురుపల్లి సీహెచ్‌సీలో, ముగ్గురు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, నాగళ్లవలస సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మరో ముగ్గురికి వైద్యులు వైద్యం అందిస్తున్నారు. సచివాలయంలో సిబ్బంది రోగులకు బెంచీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల వద్ద నుంచే నులక మంచాలను తెచ్చుకుని వాటిపైనే వైద్యం చేయించుకున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. డయేరియా కేసులు నమోదు కావడంతో నాగళ్లవలస, కెల్ల గ్రామాల్లో అధికారులు హడావుడిగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. నాగళ్లవలసలో ఎప్పటినుంచో పారిశుద్ధ్య పనులు చేపట్టలేదని, గ్రామంలో డయేరియా బయటపడడంతో అధికారులు మేల్కొని పారిశుద్ధ్య పనులు ప్రారంభించారని గ్రామస్తులు అంటున్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

గ్రామాల్లో డయేరియా విజృంభిస్తుండడంతో గుర్ల, గోషాడలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలకు పసుపు, కుంకుమ సమర్పించి రోగాలు రాకుండా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. పూజల అనంతరం ప్రతి ఇంటి నుంచి వేపచెట్టు కొమ్మలు, చేటలు, చీపుర్లు, ఇతర వస్తువులను సేకరించి గ్రామానికి నాలుగు దిక్కుల్లో వాటిని ఉంచి సుర్క్ష రేఖ కడుతున్నారు. సురక్ష రేఖ కట్టడం వల్ల అమ్మవారు శాంతించి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని గ్రామస్తులు నమ్మకంగా భావిస్తున్నారు.

గొప్ప నవల వంశవృక్షం

రాజాం సిటీ: కన్నడ రచయిత ఎస్.బైరప్ప రాసిన వంశవృక్షం నవల చాలా గొప్ప నవల అని సాహితీవేత్త పాదిలాపు శ్రీనివాసరావు ప్రశంసించారు. స్థానిక వేదగాయత్రి కళాశాలలో ఆదివారం జరిగిన రాజాం రచయితల వేదిక 117వ సమావేశంలో వంశవృక్షం నవలపై ఆయన విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. సనాతన ధర్మం, ఆధునిక సంప్రదాయం మధ్య జరిగిన సంఘర్షణలను రచయిత నవల ద్వారా చక్కగా వివరించారన్నారు. నవలలోని పాత్రల మానసిక సంఘర్షణల ద్వారా పాఠకునిలో సాంఘిక చైతన్యం కలిగించడమే రచయిత ముఖ్య ఉద్దేశ్యమన్నారు.